సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం | 3 | జూలై | 2023



స్టాంప్ పేపర్ల దందా

భూ క్రయవిక్రయాల్లో ముఖ్య భూమిక పోషించే స్టాంప్ పేపర్ల దందా జోరుగా సాగుతోంది. పాత స్టాంప్ పేపర్లకు కొత్త ధర తీసుకుంటూ విక్రయిస్తున్నారు. - 8లో ▸



అధికార పార్టీ నాయకుల భూకబ్జా..

బచ్చన్నపేట మండలంలోని ఓ వ్యవసాయ భూమిని పలువురు అధికార పార్టీ నాయకులు కబ్జా చేస్తున్నారని బాధితులు వాపోయారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
36^0 /27^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అధిక శాతం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో మామూలు ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారంలో సర్కారు విఫలం



విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ సర్కారు విఫలమైందని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) ప్రధాన కార్యదర్శి కటకం రమేశ్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన యూనియన్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా టీచర్లకు పదోన్నతులు, ఐదేళ్లుగా బదిలీలు లేవని, దీంతో వారంతా మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. రెండు డీఏలు, ఈకుబేర్‌లో వందలాది బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పీఆర్‌సీ కమిషన్ కూడా ప్రభుత్వం వేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో యూనియన్ చీఫ్ ప్యాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, తెలుగు రాష్ట్రాల కోకన్వీనర్ దాక్షపు విష్ణుమూర్తి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎస్.కృష్ణమూర్తి, కిషన్, సురేశ్‌కుమార్, బి.రాజు, సీహెచ్.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరపాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) కౌన్సిల్ హాల్‌లో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాతపూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని, ప్రజలు సమస్యల పరిష్కారానికి ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముద్రా, జ్వాలామాలినీ క్రమాలలో పూజలు





హన్మకొండ కల్చరల్: శ్రీభద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని ముద్రా, జ్వాలామాలినీ క్రమాలలో అలంకరించి పూజలు నిర్వహించారు. అంతకు ముందు ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, చతుఃస్థానార్చన పూజలు జరిగాయి. ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కుటుంబసమేతంగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు మహా శాకంబరిదేవిగా అలంకరణ



శ్రీభద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు సోమవారం ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారిని శాకంబరిదేవిగా అలంకరించనున్నారు. ఈమేరకు పలు సేవాసమితి మహిళా సభ్యులు, సిబ్బంది అమ్మవారికి అలంకరించడానికి కూరగాయలు, ఆకుకూరలతో మాలలు తయారుచేశారు.

5 నుంచి కేయూ ఎంపీఈడీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంపీఈడీ-1 సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 5 నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. 5న పేపర్-1 రీసెర్చ్ ప్రాసెస్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్, 7న పేపర్-2 ఫిజియాలజీ ఆఫ్ ఎక్సర్‌సైజ్, 10న పేపర్-3 యోగిక్ సైన్స్, 12న నాలుగో పేపర్ టెస్ట్ మెజర్‌మెంట్ అండ్ ఎవాల్యుయేషన్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షలు ఆయా తేదీల్లో మధ్యాహ్నం ఉంటాయని పేర్కొన్నారు.

కేఎంసీ ప్రిన్సిపాల్‌కు ప్రశంస పురస్కారం



ఎంజీఎం: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ తెలంగాణ స్టేట్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుంచి ప్రశంస పురస్కారం అందుకున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ సోమాజీగూడలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆయనకు పురస్కారం అందజేశారు.

డేంజర్ సైరన్

నగరంలో డివైడర్లపై వేలాడుతున్న తీగలు

- వందల సంఖ్యలో మూతలు లేని డబ్బాలు
- ట్రై సిటీ ప్రధాన రహదారుల్లో ప్రమాదకర పరిస్థితులు
- పట్టించుకోని బల్దియా అధికారులు
- భయాందోళనలో నగర ప్రజలు



హనుమకొండ వడ్డేపల్లి జంక్షన్ వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు



వరంగల్ అండర్ బ్రిడ్జి ఖమ్మం రోడ్డులో మూతలు లేని సెంట్రల్ లైటింగ్ విద్యుత్ బాక్స్‌లు

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న సెంట్రల్ డివైడర్లు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. వ్యవస్థీకృతంగా లేని తీగలు, బాక్స్‌లు ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. సెంట్రల్ డివైడర్‌పై అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ తీగల ద్వారా ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహించాలి? అనే ప్రశ్నలకు సమాధానం దొరకట్లేదు. వరంగల్, హనుమకొండ, కాజీపేట, అండర్ రైల్వేగేట్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో డివైడర్ సెంట్రల్ మీడియం విద్యుత్ స్తంభాలు వేల సంఖ్యలో ఉన్నాయి. సెంట్రల్ డివైడర్ మధ్యలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ ఏర్పాటు చేసి నగరానికి విద్యుత్ వెలుగులు అందిస్తున్నారు. రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌పై విద్యుత్ తీగలు యమపాశాలుగా మారాయి. సెంట్రల్ మీడియం స్తంభాలకు మూతలు లేని డబ్బాల్లోని విద్యుత్ తీగలు డేంజర్ సైరన్‌గా మారాయి. గ్రేటర్ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు, సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవట్లేదు. దీంతో ఎప్పుడేం జరుగుతుందోనన్న భయం పాదచారుల్లో, వాహనదారులకు పట్టుకుంది. విద్యుత్ స్తంభాలకు ఉన్న లైట్లు వెలగకపోడం, జంక్షన్ బాక్స్ విద్యుత్ వైర్లు తెగిపోవడం తదితర కారణాలతో విద్యుత్ కేబుల్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

వర్షం వస్తే తీగలతో మంటలు

డివైడర్‌పై కేబుల్ విద్యుత్ తీగలు ఇష్టారాజ్యంగా వేశారు. విద్యుత్ వైర్ల ఇన్సులేషన్స్ చాలా వరకు లేవు. మూతల్లేని విద్యుత్ పోల్ బాక్స్‌లు వైర్లు బయటకు వేలాడుతున్నాయి. వర్షం కురిస్తే చాలు మంటలు లేస్తున్నాయి. రోడ్డు వెంట వాహనదారులు, బాటసారులు భయం భయంగా వెళ్లాల్సి వస్తోంది. అక్కడక్కడా ఎర్త్ పాస్ కావడంతో జనం వణికిపోతున్నారు. హనుమకొండ ఫాతిమానగర్ నుంచి డీఐజీ బంగ్లా వరకు, కేయూసీ నుంచి భీమారం, హసన్‌పర్తి వరకు, వరంగల్ ప్రాంతంలోని ఎంజీఎం నుంచి గోపాలస్వామి గుడి వరకు, వరంగల్ అండర్ బ్రిడ్జి ఖమ్మం రోడ్డులో, కరీమాబాద్ రోడ్డులో, లేబర్ కాలనీ రోడ్డులో, కాశిబుగ్గ-ఏనుమాముల మార్కెట్ రోడ్డులో, హంటర్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో, ఎంజీఎం రోడ్డు, గోపాలస్వామిగుడి తదితర ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. వీటికి తోడు వివిధ ఇంటర్‌నెట్, టీవీ కేబుల్స్ వైర్లు విచ్చలవిడిగా వేలాడుతూ కనిపిస్తున్నాయి. గాలి వీచినప్పుడు సెంట్రల్ డివైడర్‌పై ఉన్న విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు, కేబుల్ వైర్లు పడి షార్ట్ సర్క్యూట్‌కు కారణమవుతున్నాయి. అక్కడక్కడా మంటలు లేచి తీగలన్నీ తగలబడుతున్నాయి. పశువులు విద్యుత్ తీగలకు తాకి మత్యువాత పడుతున్నాయి. పలు చోట్ల పోల్స్ వంగి పోయి ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా డివైడర్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ కేబుల్స్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టత ఇచ్చాకే వరంగల్‌కు రావాలి

- చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాతే ప్రధాని మోదీ వరంగల్‌కు రావాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ అంకెల గారడీతో అవాస్తవాలు మాట్లాడారని విమర్శించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కావాలని పోరాటం చేసిన ఫలితంగా కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. అయితే ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక కోచ్ ఫ్యాక్టరీ అని, ఏర్పాటుపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపించగానే ప్రజలను వంచించడానికి ఎత్తుగడతో వస్తున్న బీజేపీని ప్రజలు బీజేపీని నమ్మరని అన్నారు. కోచ్ ఫ్యాక్టరీ సాధించే వరకు కలిసి వచ్చే పార్టీలు, సంఘాలను కలుపుకుని పోరాడుతామని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుతో పాటు పట్టణ ఉపాధి హామీ పథకంపై ప్రధాని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేశ్, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ పాల్గొన్నారు.

పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావారవి



మాట్లాడుతున్న చావా రవి

విద్యారణ్యపురి: తెలంగాణలో ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాలు పెంచేందుకు వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కమిషన్‌ను ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు స్టేను తొలగించి ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులకు షెడ్యూల్‌ను ప్రకటించాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఈనెల 23న జరిగే జాయింట్ ఫోరం ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీం ఆధ్వర్యంలో జరిగే జాతీయ స్థాయి కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులన్నింటినీ వెంటనే మంజూరు చేయాలన్నారు. సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.సదాశివరెడ్డి, జనరల్ సెక్రటరీ పెండెం రాజు, బాధ్యులు ఎల్లయ్య, సీహెచ్.రవీందర్‌రాజు, ఎస్.జ్యోతి, డి.కిరణ్‌కుమార్, శశిధర్ రెడ్డి, స్టాలిన్‌బేగ్, డి.నవీన్‌కుమార్, పి.చంద్రయ్య, తిరునహరి శ్రీనివాస్, సీహెచ్.లింగారావు ఉన్నారు.

మెరిట్ జాబితా విడుదల

కాళోజీ సెంటర్: వరంగల్ జిల్లా విద్యాశాఖ 2019లో సమగ్ర శిక్షలో నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్ష నిర్వహించింది. ఫలితాల్లో మెరిట్ సాధించిన అభ్యర్థుల జాబితాను డీఈఓ కార్యాలయంలో నోటీస్ బోర్డుపై ప్రదర్శించినట్లు డీఈఓ వాసంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న 1:3 ప్రకారం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, 4న 1:1 ప్రకారం అభ్యర్థుల ఎంపిక, 5న తుది జాబితా విడుదల చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అభ్యంతరాలుంటే 6న స్వీకరిస్తామని, విధుల్లో చేరడానికి ఎంపికైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేస్తామని తెలిపారు.

కేఎంటీపీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రాంబాబు

గీసుకొండ: జిల్లాలోని గీసుకొండ-సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ) భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గట్టికొప్పుల రాంబాబు కోరారు. హనుమకొండలోని హరిత హోటల్‌లో ఆదివారం ఆయన కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. పార్కు కోసం భూమి ఇచ్చిన ప్రతీ రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఎకరానికి వంద గజాల ఇంటి స్థలం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి నెరవేర్చలేదని తెలిపారు. కేంద్ర మంత్రి స్పందించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని రాంబాబు తదితరులు తెలిపారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

సంగెం: నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఆయన నివాసంలో సంగెం, గీసుకొండ, ఖిలావరంగల్ మండలాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ.11,16,000 విలువైన చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. సీఎం సహాయ నిధితో పేద కుటుంబాలకు ఆర్థిక భారం లేకుండా చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గీసుకొండ జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, బీఆర్‌ఎస్ సంగెం మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని సభ సక్సెస్ చేసి

చరిత్ర సృష్టించాలి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్, పక్కన కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ తదితరులు

వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే బీజేపీ పోటీ

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్
- బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు వ్యతిరేకంగా పోరాటం
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



హనుమకొండ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాల మైదానంలో కలెక్టర్, సీపీతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

హన్మకొండ/కాజీపేట రూరల్/కేయూ క్యాంపస్/హన్మకొండ కల్చరల్: పేదల రాజ్యం, రామరాజ్య స్థాపనే బీజేపీ లక్ష్యమని, ఈనెల 8న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను సక్సెస్ చేసి చరిత్ర సృష్టించాలని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్‌కు రానున్న నేపథ్యంలో ఏర్పాటు చేసే బహిరంగ సభ సన్నాహక సమావేశం ఆదివారం హనుమకొండ స్నేహనగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్‌లో జరిగింది. అంతకు ముందు ఉదయం కాజీపేట మండలం అయోధ్యపురం-మడికొండ గ్రామాల సరిహద్దులో ప్రధాని భూమిపూజ చేయనున్న రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్, వ్యాగన్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేసే స్థలాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇతర నాయకులతో కలిసి బండి సంజయ్ పరిశీలించారు. అదేవిధంగా బహిరంగ సభ నిమిత్తం సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానాన్ని సందర్శించారు. అనంతరం హరిత కాకతీయ హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, పేదల ఎజెండాతో బీజేపీ ముందుకు పోతోందని చెప్పారు. త్యాగాల చరిత్ర కలిగిన ఓరుగల్లుకు ప్రధాని మోదీ రాబోతున్న నేపథ్యంలో కనీవినీ ఎరుగని రీతిలో స్వాగతం పలికి చరిత్ర సృష్టిద్దామన్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభను విజయ సంకల్ప సభగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'రైతులకు ఉచితంగా ఎరువులు ఇస్తాను.. మాట తప్పితే తల నరుక్కుంటాను' అని చెప్పిన సీఎం కేసీఆర్ తల ఎక్కడ పెట్టుకున్నారని విమర్శించారు. 2018 ఎన్నికలప్పుడు కేంద్రం ఏర్పాటు చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పుతుందని.. నిరుద్యోగ భృతి ఇస్తానని.. భూమిలేని దళితులకు మూడెకరాల సాగు భూమి ఇస్తానని చెప్పిన కేసీఆర్.. మాటతప్పారని అన్నారు. ఎన్నికల్లో డబ్బులు పెట్టి గెలవాలని కేసీఆర్ చూస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు వ్యతిరేకంగా బీజేపీ నిలబడి పోరాడుతుందని చెప్పారు. అంతకు ముందు రైల్వే అధికారులు వ్యాగన్ లేఅవుట్‌ను మ్యాప్ ద్వారా వివరించి.. వ్యాగన్ తయారీ పరిశ్రమకు 80 ఎకరాల స్థలం అవసరమని, సదుపాయాలు, సౌకర్యాలు, సిబ్బంది ఖాళీల గురించి చెప్పారు.

కిషన్‌రెడ్డిని కలిసిన భూనిర్వాసితులు

అయోధ్యపురం గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. భూమి కోల్పోతున్న 114 మంది రైతులకు వ్యాగన్‌షెడ్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గాదెం యాదగిరి, మేరుగు రాజయ్య తదితరులు కోరగా.. ఇప్పిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, నాయకులు గరికపాటి మోహన్‌రావు, మర్రి శశిధర్‌రెడ్డి, జి.విజయరామారావు, బంగారు శ్రుతి, పార్టీ హనుమకొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, కీర్తిరెడ్డి, రైల్వే డివిజనల్ మేనేజర్ ఎ.కె.గుప్తా, కలెక్టర్ సిక్తా పట్నాయక్, రైల్వే అధికారులు, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం పనులు వేగవంతం చేయండి



వేయిస్తంభాల ఆలయంలో కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి తదితరులు

వేయిస్తంభాల దేవాలయం కల్యాణ మండపం పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన ఆలయాన్ని సందర్శించి రుద్రేశ్వరుడికి పూజలు చేశారు. కల్యాణ మండపం పరిశీలించిన సమయంలో స్థపతి శివకుమార్ ఆలయ పరిస్థితిని వివరించారు. కాగా, ఉత్సవాల సందర్భంగా కార్యక్రమాలు జరుపుకోవడానికి పురావస్తుశాఖ అడ్డుపడుతున్నదని, భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, సిబ్బంది ప్రేమ్‌కుమార్, రజిత తదితరులు మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

సాగని 'సాగు'

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు

- 73 శాతం తీవ్ర లోటు
- సాధారణ సగటు వర్షపాతం 152.5 మి.మీ. కురిసింది 41.6 మి.మీ
- పొడి దుక్కుల్లో పత్తి వేసిన రైతులు
- వర్షం కోసం ఎదురుచూపులు



ఈ ఫొటోలోని రైతుపేరు రేవూరి జయపాల్‌రెడ్డి. హనుమకొండ జిల్లా ఆత్మకూరుకు చెందిన ఈయనకు గ్రామ శివారున ఉన్న రెండెకరాల భూమిలో పది రోజుల క్రితం పత్తి విత్తనాలు వేశాడు. మొన్న కురిసిన కొద్ది పాటి వర్షానికి మొలకలు వచ్చినా.. మళ్లీ వర్షం కురవకపోవడంతో సగానికి పైగా మొక్కలు వాడిపోయాయి. వాటిని బతికించుకునేందుకు సీసాలతో ఒక్కో మొక్కకు ఓపికగా నీళ్లు పోస్తూ నానా తంటాలు పడుతున్నాడు.

హన్మకొండ: జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు ముందుకు వెళ్లడం లేదు. జూన్ ముగిసినా సాలు పెట్టే వాన కురవలేదు. జూన్‌లో జిల్లా సాధారణ సగటు వర్షపాతం 152.5 మిల్లీమీటర్లు కాగా.. ఇప్పటి వరకు కురిసింది 41.6 మి.మీ మాత్రమే. గతేడాది జూన్‌లో 201.8 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. కురిసింది. 73 శాతం లోటు వర్షపాతం కారణంగా పచ్చని పంటలతో కళకళలాడాల్సిన చెల్కలు బీడువారి దర్శనమిస్తున్నాయి. జూన్‌లో నాలుగైదు రోజులు జల్లులు కురిసి రైతుల్లో ఆశలు నింపిన వర్షం ప్రస్తుతం మండుతున్న ఎండలతో వేసవిని తలపిస్తోంది. మేఘాలు కమ్ముకుని ఊరిస్తున్నా.. ఇప్పటి వరకు మోస్తరు వర్షం కూడా కురవలేదు.

పొడి దుక్కుల్లోనే పత్తి..

వేసవిలో కురిసిన అకాల వర్షాలకు రైతులు దుక్కులు చేసి పత్తి విత్తేందుకు సాలు పెట్టి సిద్ధమయ్యారు. మరికొందరు పత్తి సాగు ఆలస్యం అవుతుందని.. వర్షం కురవగానే మొలకెత్తుతాయని పొడి దుక్కుల్లోనే విత్తనాలు వేశారు. పది రోజుల క్రితం కురిసిన జల్లులకు విత్తనాలు మొలకెత్తాయి. ఆతర్వాత వర్షాలు దోబూచులాడుతుండడంతో రైతులు వర్షం కోసం ఆశగా చూస్తున్నారు. కొందరు రైతులు వాడిపోతున్న మొక్కలను బతికించుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. మరికొందరు రైతులు మాత్రం నీరు పారిస్తూ పంటను కాపాడుకుంటున్నారు.

గతేడాది ఈ సమయానికి..

గతేడాది ఇదే సమయానికి జిల్లాలో దాదాపు 60 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. ఈ ఏడాది 85 వేల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే ఇప్పటి వరకు 21,652 ఎకరాల్లో మాత్రమే సాగైంది. పత్తి పంట పరిస్థితి ఇలా ఉంటే.. ఇతర పంటల సాగువైపు రైతులు ఆలోచించడం మానేశారు. ప్రధానంగా వరి పండించే రైతులు ఇప్పటి వరకు పట్టించుకోలేదు. జిల్లాలో పరకాల, దామెర మండలాల్లో వరి నారు పోసిన దాఖలాలు లేవు. మిగతా మండలాల్లో మొక్కుబడిగా నార్లు పోసి వర్షం కోసం చూస్తున్నారు. మొక్కజొన్న, కంది, నువ్వులు, జొన్న, పెసర వంటి మెట్ట పంటల సాగు ప్రశ్నార్థకంగా తయారైంది.

జూన్ నెలలో వర్షపాతం (మిల్లీమీటర్లలో)

మండలం	సాధారణం	కురిసింది	గతేడాది కురిసింది
భీమదేవరపల్లి	115.6	52.0	252.6
వేలేరు	119.7	103.4	284.3
ఎల్కతుర్తి	151.5	27.6	243.5
కమలాపూర్	135.6	26.0	110.0
హసన్‌పర్తి	158.1	30.0	206.0
ధర్మసాగర్	133.1	59.9	234.0
కాజీపేట	154.1	26.0	198.8
హనుమకొండ	163.7	24.2	226.7
ఐనవోలు	142.2	69.5	313.8
పరకాల	168.6	14.7	166.4
దామెర	170.4	23.6	115.8
ఆత్మకూరు	169.2	55.1	156.8
శాయంపేట	180.5	36.6	175.4
నడికూడ	173.1	19.7	139.8

భర్త ప్రాణం కాపాడిన భార్య

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలోని తాళ్లగడ్డ ప్రాంతంలో విద్యుత్ ప్రమాదంలో చిక్కుకున్న భర్తను తన భార్య కాపాడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లగడ్డకు చెందిన బండారి సత్య నారాయణ ఇంట్లో ఒక్కసారిగి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పొగలు కమ్ముకున్నాయి. అయితే సత్య నారాయణ టైలర్‌గా పనిచేస్తుంటాడు. ఈక్రమంలో దుస్తులకు మంటలు అంటుకుంటాయనే ఆందోళనతో వాటిని తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన భార్య సుజాత వెంటనే కర్రతో భర్త చేయిపై కొట్టడంతో ప్రాణాపాయం తప్పింది. సొమ్మసిల్లిన సత్యనారాయణను ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. భార్య ధైర్యంగా సమయస్ఫూర్తిగా వ్యవహరించి భర్త ప్రాణం కాపాడుకుందని స్థానికులు ఆమె ధైర్యాన్ని మెచ్చుకున్నారు. ఇదిలా ఉండగా.. అయితే విద్యుత్ ప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని తెలుసుకునేందుకు విద్యుత్‌శాఖ అధికారులకు బాధితులు సమాచారం అందజేశారు. దర్యాప్తు కొనసాగుతోంది.

అత్తపై దాడి.. అల్లుడిపై కేసు

ఖిలా వరంగల్: అత్తపై దాడి చేసిన అల్లుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ శాంతినగర్‌కు చెందిన బరిగల నాగమణి, భర్త రమేష్ దంపతులు. వీరు కూలిపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో బరిగల రమేష్.. భర్తను వదిలేసి తనను పెళ్లి చేసుకోవాలని మరదలు వంకల రాణిని వేధిస్తున్నాడు. ఆదివారం ఉదయం రమేష్ తన భార్య నాగమణిని కొడుతున్నాడు. చుట్టు పక్కల వారు చూసి హన్మకొండ బొక్కల గడ్డలో నివాసముంటున్న ఆమె చెల్లి వంకల రాణితోపాటు తల్లి బొమ్మకంటి స్వరూప చెప్పగా వారు శాంతినగర్‌లోని నాగమణి ఇంటికి చేరుకున్నారు. గొడవ విషయంపై అత్త స్వరూప నిలదీయగా కోపోద్రిక్తుడైన రమేష్ కర్రతో కొట్టగా ఆమెకు తీవ్రగాయలయ్యాయి. వెంటనే ఎంజీఎంకు తరలించారు. వంకల రాణి ఫిర్యాదు మేరకు బరిగల రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్యపై దర్యాప్తు

ఖిలా వరంగల్: ఓ వ్యక్తి బెదిరింపులు, పరువుపోతుందనే భయందోళన గురైన ఆకుల సౌజన్య సంపులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఆదివారం ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో దర్యాప్తు వేగవంతం చేశారు. మహిళ మృతికి కారణమైన వ్యక్తిని మిల్స్‌కాలనీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఓ ప్రైవేట్ కళాశాలలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్ నీకు ఎలా పరిచయం..? ఎలా బెదిరింపులకు పాల్పడ్డావు? అనే కోణంలో నిందితుడిని విచారిస్తున్నట్లు తెలిసింది.

స్టాంప్ పేపర్ల దందా..

- పాత పేపర్‌కు.. కొత్త ధర
- ఉమ్మడి వరంగల్‌లో జోరుగా..



కాజీపేట అర్బన్: భూక్రయవిక్రయాల్లో ముఖ్య భూమిక పోషించడమే కాకుండా భూమిపై హక్కు సాధించుకునేందుకు తోడ్పడే దస్తావేజులతో దందా జరుగుతోంది. పాత స్టాంప్ పేపర్లను.. కొత్త ధరతో విక్రయిస్తున్నారు. ఇటీవల ఆన్‌లైన్ స్టాంప్ పేపర్ల విక్రయాలపై రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో పాత స్టాంప్ పేపర్లపై భూఆక్రమణదారులు దృష్టిపెట్టడంతో ఉమ్మడి జిల్లాలో గిరాకీ పెరిగింది. ఇదేఅదనుగా పాత స్టాంప్ పేపర్లకు కొత్త రేటు తీసుకుంటూ విక్రయిస్తున్నారు.

548 మంది స్టాంప్ వెండర్లు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 548 మంది స్టాంప్ వెండర్లు 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిని టార్గెట్ చేసుకుని స్టాంప్ పేపర్ల విక్రయాలను కొనసాగిస్తున్నారు. కాగా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ 5 శాతం కమిషన్‌తో 20, 50, 100 రూపాయల నాన్ జ్యూడీషియల్ స్టాంప్ పేపర్లను వెండర్లకు విక్రయిస్తుంటారు. అదనపు ఆదాయం కోసం కొంత మంది స్టాంప్ వెండర్లు పాత డేట్స్‌లోని స్టాంప్ పేపర్లను బ్లాక్ చేసి ఎక్కువ డబ్బులకు విక్రయిస్తున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఏడాదికి 8 కోట్ల ఆదాయం ఖజానాకు సమకూరుతోంది.

వంద విలువకు.. రూ.10వేల పైన ..

వంద రూపాయల విలువ కలిగిన పాత స్టాంప్ పేపర్‌కు గిరాకీ పెరిగింది. దీనికి రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు కూడా చెల్లించేందుకు సిద్ధమవుతున్నారంటే.. దందా ఏ స్థాయిలో కొనసాగుతున్నదో అర్థం అవుతోంది. పాత డేట్స్‌తో కూడిన పేపర్లను కొనుగోలు చేసి పాత తేదీల్లో భూమిని కొనుగోలు చేసినట్లు నోటరీల వద్ద రాయించుకుని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇంపౌండింగ్ చేసుకుంటూ భూఆక్రమణలకు పాల్పడుతున్నారు.

అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆన్‌లైన్ విధానం..

స్టాంప్ పేపర్ల అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువచ్చాం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని లైసెన్స్‌డ్ స్టాంప్ వెండర్లకు జూన్ 20వ తేదీన ఆన్‌లైన్ విక్రయాలపై అవగాహన కల్పించాం. ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో స్టాంప్ పేపర్ల విక్రయాలను కొనసాగిస్తే చర్యలు తీసుకుంటాం.

- హరికోట్ల రవి, జిల్లా రిజిస్ట్రార్

అధికార పార్టీ నాయకుల భూకబ్జా..

- ఎమ్మెల్యే పేరుతో బోర్డులు..
- భూయజమానుల ఆరోపణ

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని జనగామ రోడ్డులో గల ఎస్ఆర్ పెట్రోల్ పంపు ఎదుట, పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న వ్యవసాయ భూమిని పలువురు అధికార పార్టీ నాయకులు ఆక్రమిస్తున్నారని భూయజమానులు మార్క అంజయ్య, ఈశ్వరయ్య, కిషన్ అన్నారు. ఈమేరకు ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని 580, 582 సర్వేనంబర్లలో 4 ఎకరాల పట్టా భూమిని తమ పూర్వీకుల నుంచి సాగుచేసుకుంటున్నామన్నారు. అయితే ఆ భూమిలో అధికార పార్టీ నాయకుడు గిరబోయిన అంజయ్య ప్రవేశించి పలువురు బడా నాయకులకు ప్లాట్లు ఇప్పించి తాను కూడా ఓ ప్లాటును తీసుకుని వారి వారసుల పేరున రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారన్నారు. అనంతరం జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పేరున కాలనీ ఏర్పాటు చేస్తున్నట్లు బోర్డును కూడా ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటి వరకు తమ తాతలు, ముత్తాతలు, తండ్రులు ఎవరైనా ఆ భూమిని అమ్మినట్లు డాక్యుమెంట్లు తీసుకువస్తే స్వచ్ఛందంగా వారికి ఇస్తామన్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



పాస్ పుస్తకాలను చూపుతున్న యజమానులు

ఖమ్మం సభకు వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులపై దాడి

- ఓ వ్యక్తి తలకు తీవ్ర గ్రాయాలు



దాడిలో గాయపడిన భూక్య సోమన్న

మరిపెడ రూరల్: ఖమ్మంలో తలపెట్టిన రాహుల్ గాంధీ జనగర్జన సభకు వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడిచేయగా ఒకరి తలకు తీవ్ర గాయలయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం మూలమ్రితండ జీపీ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. గాయాలైన బాధితుడు భూక్య సోమన్న కథనం ప్రకారం.. ప్రజాగర్జన సభకు మూలమ్రితండా నుంచి డీసీఎంలో కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్తున్న క్రమంలో బీఆర్ఎస్ నాయకుడు భూక్య రఘు మరి కొందరు డీసీఎంకు ఎదురుగా వచ్చి అడ్డుకున్నారు. సభకు వెళ్లవద్దని వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట.. ఘర్షన వాతావరణం చోటు చేసుకుంది. ఈ క్రమంలో రఘు అనే బీఆర్ఎస్ నాయకుడు బీరు సీసాతో భూక్య సోమన్న తలపై బలంగా కొట్టినట్లు బాధితుడు పేర్కొన్నాడు. క్షతగాత్రున్ని స్థానికులు మరిపెడలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ విషయంపై దాడి చేసిన వ్యక్తి రఘుపై మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సోమన్న తెలిపాడు.

కోర్టుకు నిందితుల సరెండర్

బచ్చన్నపేట: రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య నిందితులను విచారణ అనంతరం పోలీసులు ఆదివారం కోర్టులో సరెండర్ చేశారు. గిరబోయిన అంజయ్యతో పాటు ఆయనకు సహకరించిన సుపారీ గ్యాంగ్ సభ్యులను పోలీసులు ఇటీవల కస్టడీలోకి తీసుకున్నారు. మూడు రోజుల నుంచి నిందితులను విచారించగా పలువురు ప్రధాన నిందితుల పేర్లు బయటకు వచ్చాయి. విచారణ అనంతరం అనుమానితులను కోర్టుకు తరలించారు. రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణయ్యను హత్య చేసిన కేసులో అంజయ్యను విచారిస్తుండగా తన బావమరిది భార్య సుభద్రను కూడా హత్య చేసినట్లు ఆయన ఒప్పుకోవడంతో ఆ కేసును మళ్లీ విచారిస్తున్నారు. సుభద్ర మృతదేహానికి రీ–పోస్టుమార్టం నిర్వహించాలని పోలీసులు నిర్ణయించడంతో వైద్యాధికారులు నాలుగు రోజులు గడువు కోరినట్లు సమాచారం. ఆ కేసుతో కూడా పలువురిని రిమాండ్‌కు తరలించనున్నట్లు చర్చ జరుగుతోంది. అంజయ్య.. రెండు హత్యలను చేయించడంతో పోలీసులకు ఏ హత్య కేసులో అనుమానం వచ్చినా ఆయనను కస్టడీకి తీసుకోవడానికి అనుమతులు ఉన్నట్లు సమాచారం. సుభద్ర మృతదేహానికి రీ-పోస్టుమార్టం నిర్వహించే సమయంలో కీలక నిందితులను మళ్లీ అదుపులోకి తీసుకుని మరింత సమాచారాన్ని రాబట్టడమే లక్ష్యంగా పోలీసులు ముందుకెళ్తున్నారు. ఈ హత్యకు సహకరించిన వారు కోర్టుకెళ్లడం ఖాయమని పలువురు పేర్కొంటున్నారు.

దర్శనానికి వెళ్తూ కనిపించని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం వనదేవతల దర్శనానికి వెళ్తున్న క్రమంలో డ్రైవర్ అజాగ్రత, అతివేగం వల్ల ఓ మహిళ మృతి చెందారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన డ్రైవర్.. అదుపు తప్పి కారును రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో మహిళ తీవ్రగాయాలకు గురై చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామానికి చెందిన కస్తూరి నవీన్‌కాంత్, తన భార్య శ్వేత, పిల్లలు శ్రీహన్, ఆయాన్, తల్లి బాలమణి, అత్తమామలు పద్మవతి, విశ్వనాథ్‌తో కలిసి శనివారం రాత్రి మేడారానికి కారులో బయలు దేరారు. ఆదివారం తెల్లవారు జామున పస్రా దాటిన తర్వాత తోగు సమీపంలో డ్రైవర్ కారును అజాగ్రతగా, అతివేగంగా నడపుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో బాలమణి, శ్రీహాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను వెంటనే 108లో ములుగు ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలమణి (55)మృతి చెందింది. శ్రీహాన్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ తరలించారు. దీనిపై నవీన్‌కాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.



బాలమణి, శ్రీహాన్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

పనికి వెళ్లొస్తూ..

- రోడ్డు ప్రమాదంలో కొడుకు దుర్మరణం
- తండ్రికి తీవ్రగాయాలు.. ఖమ్మం ఆస్పత్రికి తరలింపు
- మృతుడికి కానిస్టేబుల్ పరీక్షలో మెరిట్ మార్కులు



వేణు (ఫైల్)

గార్ల: అటు చదువు.. ఇటు కుటుంబ పోషణ.. రెండింటిలో తనవంతు బాధ్యత నిర్వర్తిస్తున్న ఓ విద్యార్థిని మృత్యువు వెంటాడింది. రోడ్డు ప్రమాద రూపంలో కబలించింది. దీంతో చేతికి అందివచ్చిన కుమారుడు తమ కష్టాలు తీర్చుతాడని భావించిన ఆ తల్లిండ్రులకు తీరని శోకం మిగిలింది. గ్రామస్తుల కథనం ప్రకారం మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన తండ్రికొడుకులు నూనావత్ కేవుల్యా, వేణు(24) బైక్ పై సెంట్రింగ్ పనికి ఖమ్మం జిల్లా కూసుమంచికి వెళ్లారు. పని ముగిసిన అనంతరం బైక్ పై స్వగ్రామానికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో వేణు అక్కడికక్కడే మృతిచెందాడు. కేవుల్యాకు తీవ్రగాయాలుకాగా చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాగా, వేణు ఇటీవల ప్రకటించిన పోలీస్ కానిస్టేబుళ్ల ఫలితాల్లో 133 మెరిట్ మార్కులు సాధించాడు. ఎస్టీ కోటాలో మృతుడికి ఖచ్చితంగా కానిస్టేబుల్ ఉద్యోగం వస్తుందని స్థానికులు పేర్కొన్నారు. చదువులో, కుటుంబ పోషణలో తనవంతు బాధ్యత నిర్వర్తిస్తున్న వేణు మృతి చెందడం కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులను కంటితడికి గురిచేసింది. తండ్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనతో పినిరెడ్డిగూడెంలో విశాదఛాయలు అలుముకున్నాయి.

జనగామ జిల్లా కేంద్రంలో యువకుడు..

జనగామ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా.. మరొకరికి గాయాలైన ఘటన జనగామ జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని బచ్చన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన నిడిగొండ శ్రీను, కొడవటూర్ గ్రామానికి చెందిన రాసూరి అజయ్ ద్విచక్రవాహనంపై రఘునాథపల్లి నుంచి జనగామకు వస్తున్నారు. ఈక్రమంలో వాహనాన్ని వేగంగా నడపడంతో అదుపుతప్పి డివైడర్ మధ్యలో ఉన్న కరెంట్ స్తంభానికి ఢీ కొనడంతో బైక్ వెనక కూర్చున్న నిడిగొండ శ్రీను(20) ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న అజయ్‌కు చేయి విరిగి తీవ్ర గాయలు కాగా జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘనటపై కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మెడికల్ సీట్ల పేరుతో మోసం

- వ్యక్తి అరెస్ట్.. రూ.3లక్షల నగదు స్వాధీనం

కాజీపేట: మెడికల్ సీట్లు ఇప్పిస్తానని పలువురిని నమ్మించి రూ.లక్షల్లో దండుకుని మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన చాగంటి నాగసాయి శ్రీనివాస్(53) తనకున్న పరిచయాలతో వరంగల్‌కు చెందిన బరిగెల విజయ్‌కుమార్ కూతురికి ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని నమ్మించి వారి నుంచి రూ.9 లక్షల వరకు వసూలు చేశాడు. సీటు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన విజయ్‌కుమార్ సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయగా ఆయన స్పందించి టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దించారు. వారు నాగసాయి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.3లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. హనుమకొండ ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు అల్లం రాంబాబు, కె.శ్రీనివాస్‌రావు, ఎస్సైలు జి.రమేష్, పెండ్యాల దేవేందర్, లవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ

కుటుంబం చెంతకు చేర్చిన ‘సఖి’

కాజీపేట అర్బన్ :‘సఖి’ వన్‌స్టాప్ సెంటర్.. మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళను కుటుంబ సభ్యులకు చెంతకు చేర్చింది. సెంటర్ నిర్వాహకుల కథనం ప్రకారం హనుమకొండ నయీంనగర్‌కు చెందిన ఎర్ర మంజుల మతిస్థిమితం కోల్పోయి 2022 డిసెంబర్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు హనుమకొండ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా సమాచారం సేకరించిన హనుమకొండ జిల్లా సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి.. దేశవ్యాప్తంగా మహిళలకు అండగా నిలిచేందుకు ఏర్పాటు చేసి వన్‌స్టాప్ సెంటర్ వాట్సాప్ గ్రూప్‌ల్లో పంపించారు. ఈక్రమంలో మధ్యప్రదేశ్‌లోని రేవా ప్రాంతంలో మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళ సంచరిస్తున్నట్లు రేవా ప్రాంత వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకులు గుర్తించారు. అనంతరం మహిళను వైద్యం నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మహిళ మానసిక స్థితి మెరుగుపడడంతో తన పేరు ఎర్ర మంజుల అని, తనది హనుమకొండ నయీంనగర్ అని వివరాలు తెలిపింది. దీంతో హనుమకొండలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌కు రేవా వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకులు సమాచారం అందజేశారు.



మంజులను అప్పగిస్తున్న సెంటర్ నిర్వాహకులు

8 నెలల తర్వాత కుటుంబ సభ్యుల చెంతకు..

మతిస్థిమితం కోల్పోయి హనుమకొండ నుంచి మధ్యప్రదేశ్‌కు వెళ్లిన మహిళను సఖి వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకులు ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు.. సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి, కేస్ వర్కర్ వినీల, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కుమారుడి మృతిని తట్టుకోలేక..

- ఆత్మహత్యకు తల్లి యత్నం
- ఎంజీఎంకు తరలింపు
- పరిస్థితి విషమం
- గార్లలో ఘటన

గార్ల: నవమాసాలు మోసి అల్లారుముద్దగా పెంచిన కుమారుడు ఐదు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకోవడంతో ఆ పేరుబంధం తల్లడిల్లింది. తన కుమారుడు లేని బతుకు తనకెందుకని మనస్తాపానికి గురైన తల్లి.. తానూ ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన ఆదివారం గార్ల మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మండల కేంద్రం పుట్టకోట బజారుకు చెందిన వేపచేదుల శివ(16) ఐదు రోజులు క్రితం తల్లి ధనలక్ష్మి మందలించిందని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే నీ వల్లే కుమారుడు శివ మృతిచెందాడని భర్త, చుట్టుపక్కల వారు ధనలక్ష్మిని నిలదీయడంతో తట్టుకోలేక బాత్‌రూమ్ లోకి వెళ్లి ఆత్మహ్యతకు యత్నించింది. తల్లి బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఇంకా రావడం లేదని కుమార్తె తలుపు కొట్టగా ఎంతకూ తీయలేదు. దీంతో బాత్‌రూమ్ తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే ధనలక్ష్మి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే క్షతగాత్రురాలిని గార్ల సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించారు. ప్రస్తుతం ధనలక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు.

గుండా ప్రకాశ్‌రావుపై కేసు నమోదు

- ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో విచారణ

మామునూరు: కొనుగోలు చేసిన భూమిని ప్లాట్లుగా మార్చి సభ్యులకు పంపిణీ చేయకుండా ఏళ్ల తరబడి మోసగిస్తున్నాడని బాధితుల ఫిర్యాదు మేరకు మామునూరు పోలీస్‌స్టేషన్‌లో నగర ఆర్యవైశ్య సహకార సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావుపై గత నెల 29న కేసు నమోదైనంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. గుండా ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో వరంగల్ ఆర్యవైశ్య సహకార సంఘం ఏర్పడింది. అందులో 200 మంది సభ్యులు చేరారు. రూ.1.50లక్షలు చెల్లిస్తే ప్రతి సభ్యుడికి 150 గజాల స్థలాన్ని ఇచ్చే విధంగా ఒప్పందం కుదిరింది. సభ్యుల అభీష్టం మేరకు సంఘం అధ్యక్షుడు ప్రకాశ్‌రావు ఖిలావరంగల్ మండల బొల్లికుంట గ్రామ శివారులో 2013 సంవత్సరం భూమిని కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి కొంత మంది సభ్యులకు ఇచ్చారు. మరి కొంత మందికి ఆదిగో ఇదిగో అంటూ ఏళ్ల తరబడి తిప్పించుకుంటున్నాడు. దీనిపై సభ్యులు ప్రకాశ్‌రావును నిలదీశారు. అయినా ఏలాంటి స్పందన రాకపోవడంతో బాధితులు గండె చంద్రశేఖర్, వెనిశేటి సదాకుమార్ గత నెలలో వేర్వేరుగా మామునూరు పోలీస్‌స్టేషన్‌లో గుండా ప్రకాశ్‌రావుపై ఫిర్యాదు చేశారు. దీనిపై మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ విచారణ చేపట్టి ప్రకాశ్‌రావుపై కేసు నమోదు చేశారు. బాధితులకు త్వరగా న్యాయం చేసేందుకు కేసు దర్యాప్తులో వేగం పెంచినట్లు తెలిసింది.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఖిలా వరంగల్: ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ ఓ యువకుడు ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఖిలా వరంగల్ మండలం మామునూరుకు చెందిన ఎండీ అక్బర్ రెండో కుమారుడు ఎండీ ఉస్మాన్(22) వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఓ వైన్స్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీగానే షాపు బంద్ చేసిన తర్వాత శనివారం రాత్రి బిర్యానీ తినేందుకు ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌పై మండిబజార్‌కు వెళ్లి రాత్రి 12.30గంటలకు మామునూరుకు బయల్దేరారు. ఈ క్రమంలో ఫోర్ట్‌రోడ్డుపై భూపేష్‌నగర్ కాలనీ స్టేజీ వద్దకు చేరుకోగానే వీధికుక్కను తప్పించబోయి బైక్ డీవైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీనితో ఎండీ ఉస్మాన్‌కు తీవ్రగాయాలు కాగా ఇద్దరు స్వల్పగాయలతో బయటపడ్డారు. క్షతగాత్రులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం ఉస్మాన్ మృతిచెందాడు. మృతుడి తండ్రి అక్బర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

అడ్తి వ్యాపారి ఆత్మహత్య

వరంగల్: కాశిబుగ్గ చెందిన అడ్తి వ్యాపారి బరుపాటి యుగంధర్(60)శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏనుమాముల ఎస్సై శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. ఏనుమాముల మార్కెట్ సమీపంలోని మధుశాల బార్ పక్కనే అనుషప్రియ ట్రేడర్స్ పేరుతో వ్యాపారం చేస్తున్న యుగంధర్‌కు అప్పులు ఎక్కువ కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించారు. శనివారం సాయంత్రం 4గంటలకు అడ్తి షాపునకు వచ్చిన యుగంధర్ రాత్రి 7గంటల వరకు ఇంటికి చేరకపోవడంతో కుమారుడు సంతోష్ వచ్చి చూడగా పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే తండ్రిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలి పారు. సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపారు.

నలుగురిని కాపాడిన గంగపుత్రులు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరిలో ఆదివారం వరంగల్ జిల్లా కేంద్రం నుంచి పుణ్యస్నానాలు చేయడానికి వచ్చిన నలుగురు నీటిలో మునిగిపోతుండగా గంగపుత్రులుకాపాడారు. కుటుంబ సభ్యులతో వచ్చిన వారు స్నానాలు చేస్తూ లోతుప్రవాహంలోకి వెళ్లారు. ఒకరినొకరు పట్టుకొని నీటిలో మునిగిపోతుండగా గమనించిన గంగపుత్రులు ఈదుకుంటూ వెళ్లి బైరి కార్తీక్ (16)తో పాటు మరో ముగ్గురిని రక్షించి ఒడ్డుకు చేర్చారు.

గోదావరి వద్ద కొరవడిన కాపలా..

ఇలా నిత్యం నీటిలో మునిగి పోతున్న సంఘటనలు జరుగుతున్నా పోలీసులు రక్షణ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వర్షాకాలంలో గోదావరి పెరుగుతూ..తగ్గుతూ ఉంటుంది. దీనిని అంచనా వేయకుండా యువకులు నీటిలోకి దిగుతుండడంతో ప్రమాదాలకు దారితీస్తోంది.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

- పుల్లెల గోపీచంద్

జనగామ రూరల్: గొప్ప క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని గ్రామీణ క్రీడాకారులు పట్టుదలతో జాతీయ స్థాయిలో రాణించాలని రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ పుల్లెల గోపీచంద్ అన్నారు. స్థానిక బతుకమ్మకుంటలోని వైఎస్ఆర్ భవన్‌లో ఉమ్మడి వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పింగిళి రమేష్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత క్రీడలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. నిరంతరం సాధనతోనే ఇది సాధ్యమని సూచించారు. జనగామ జిల్లాలో గొప్ప క్రీడాకారులు ఉన్నారని వారిని వెలికితీసి జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి క్రీడలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోపగోని సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కైరిక హనుమంతారావు, కోశాధికారిగా మార్యల రమేష్, ఉపాధ్యక్షుడుగా తాళ్లపల్లి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా మైకేల్, కార్యవర్గ సభ్యులుగా శ్యాంశం, శేఖర్, అనిల్‌కుమార్, రాజు, మనోజ్‌కుమార్, అశోక్, రవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపీచంద్

పంటలను కాపాడుకోవడానికి విశ్వప్రయత్నం

మల్హర్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఇప్పటికే సాగు చేసిన కూరగాయ పంటలను కాపాడుకోవడానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొండపేట జీపీ పరిధి కుంభంపల్లిలో ఓ రైతు కుటుంబం విశ్వప్రయత్నం చేస్తోంది. గ్రామానికి చెందిన కుంభం తిరుపతి, లత దంపతులు 20 గుంటల భూమిలో అల్చింద, బీర తదితర కురగాయల పంటలు సాగు చేశారు. గింజలు నాటిన్పటి నుంచి సక్రమంగా వర్షాలు కురవక పోవడంతో అక్కడక్కడా మొలకెత్తాయి. అవికూడా నీరులేక చనిపోతున్నాయి. దీంతో వాటిని బతికించుకోవడానికి దంపతులు ఇంటి నుంచి బిందెలు, క్యాన్లలో నీటిని తీసుకవచ్చి మొక్కలకు, గింజలు నాటిన ప్రదేశంలో పోస్తున్నారు. ఈ గ్రామంలో కొనెళ్లుగా రైతులు కూరగాయలు పంటలను అధికంగా పడిస్తుడంటంతో ‘కూరగాయల కుంభంపల్లి’ అనే పేరు వచ్చింది.



బిందె, క్యాన్లతో నీళ్లు పోస్తున్న రైతు